www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 24 సెప్టెంబర్ 2025 5 కాకినాడ



జిజిహెచ్‌లో 2డి ఎకో సేవలు ప్రారంభం

ప్రజాశక్తి - కాకినాడ



2డి ఎకో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

స్థానిక ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో 2డి ఎకో గుండె వైద్య పరీక్షలు మంగళవారం నుంచి తిరిగి ప్రారంభమయ్యాయి. గత కొంత కాలంగా ఆగిపోయిన కార్డియాలజీ సేవలు ప్రస్తుతం ఇన్‌సోర్సింగ్ విధానంలో సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి చొరవతో 2డి ఎకో సేవలు ప్రారంభమయ్యాయని డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఒక్కరోజునే 30 మందికి 2డి ఎకో పరీక్షలు చేశారు.

ప్రమాదం అంచున ప్రయాణం

- ఆర్‌టిసి బస్సుల్లో వేలాడుతున్న విద్యార్థులు
- విద్యాసంస్థల పని వేళల్లో తప్పని తిప్పలు
- అదనపు బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా ఆర్‌టిసి సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సరిపడా బస్సులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అనేక అవస్థలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా విద్యాసంస్థల సమయాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తుంది. విద్యార్థులతోపాటు ఇతర ప్రయాణికులు ఫుట్ బోర్డులపై ప్రయాణాలు సాగిస్తున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రజా రవాణా అధికారులు ఈ సమస్యను పరిష్కరించాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఫుట్ బోర్డుపై ప్రయాణాలు చేస్తున్న విద్యార్థులు

కాకినాడ జిల్లాలో 304 ఆర్‌టిసి బస్సులు సేవలందిస్తున్నాయి. వీటిలో వెన్నెల ఎసి బస్సులు 2, నైట్ రైడర్స్ 2, అమరావతి 4, ఇంద్ర ఎసి బస్సులు 17, స్టార్ లైనర్ 4, సూపర్ లగ్జరీలు 57, అల్ట్రా డీలక్స్ 24, ఎక్స్‌ప్రెస్‌లు 19, అల్ట్రా పల్లె వెలుగు 39, పల్లె వెలుగు బస్సులు 136 ఉండగా ఇవి రోజుకి 1,14,630 కిలోమీటర్లు నడుస్తున్నాయి. సరాసరి రోజుకి సుమారు 80 వేల మంది ప్రయాణిస్తున్నారు. రోజుకి దాదాపు రూ.52 లక్షల వరకూ ఆర్‌టిసికి ఆదాయం సమకూరుతోంది. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తుండడంతో సుమారు మరో 40 శాతం వరకూ ఆక్యుపెన్సీ పెరిగిందని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. దీంతో ప్రధాన రూట్‌లలో ఒంటి కాలిపై నిలబడి ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ నేపథ్యంలో పలువురు ప్రయాణికులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఉచిత పథకం కారణంగా టిక్కెట్లు తీసుకుని ప్రయాణాలు సాగిస్తున్న వారంతా అసౌకర్యానికి గురవుతున్నారు. అనేక చోట్ల బస్సులలో సీట్ల కోసం మహిళలు బాహాబాహీకి దిగుతున్నారు. ఘర్షణ వాతావరణం నెలకొనడంతో సిబ్బందికి ఒత్తిడి తప్పడం లేదు.

ప్రమాదకరమైన ప్రయాణం

ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యాసంస్థలకు వెళ్లి వచ్చే విద్యార్థులు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణం సాగిస్తున్నారు. కళాశాలలకు సమయానికి హాజరు కావాల్సి ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్ బోర్డులపైనే వేలాడుతూ వెళ్లాల్సి వస్తుంది. పలు సందర్భాల్లో ఇతర ప్రయాణికులు సైతం ఇదే పంథాలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. వివిధ సంస్థల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు నిత్యం రాకపోకలు ఆర్‌టిసి పైనే సాగిస్తున్నారు. వీరంతా విధిగా సమయానికి వెళ్లాల్సి వస్తుంది. దీంతో రద్దీ అనివార్యంగా మారింది. ముఖ్యంగా కాకినాడ, రాజమహేంద్రవరం, పెద్దాపురం, అమలాపురం వంటి పట్టణాలకు వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో విద్యార్థులు ప్రజా రవాణా వ్యవస్థ ద్వారానే ప్రయాణం చేస్తున్నారు. అయితే ప్రమాదపు అంచున ప్రయాణం సాగుతున్న నేపథ్యంలో పలువురు విద్యార్థులు తరచూ చిన్న చిన్న ఘటనలలో ప్రమాదాలకు గురవుతున్నారు.

సరిపడని బస్సులు

నిత్యం తుని నుంచి కాకినాడ, కాకినాడ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ నుంచి అమలాపురం వంటి ప్రాంతాలకు పదుల సంఖ్యల్లో బస్సులు నడుస్తున్నారు. అయితే ఈ రోడ్లలో ప్రయాణాలు సాగించేవారు ఎక్కువగా ఉంటున్నారు. దీంతో ప్రస్తుతం ఉన్న బస్సుల సంఖ్య ఏమాత్రం సరిపోవటం లేదని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన తర్వాత రద్దీ తీవ్ర స్థాయిలో పెరిగిన నేపథ్యంలో బస్సుల సంఖ్యను మరింతగా పెంచాల్సిన అవసరం ఉందని పలువురు చెబుతున్నారు. ఫుట్ బోర్డులపై ప్రయాణాన్ని నివారించేలా ఆర్‌టిసి అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలోనే సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

త్వరలోనే 50 బస్సులు



మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ప్రస్తుత అవసరాల రీత్యా జిల్లాకు 50 కొత్త బస్సులు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. దీనివల్ల చాలా వరకు రద్దీ ప్రయాణాలు తగ్గే అవకాశం ఉంది. ఫుట్ బోర్డు ప్రయాణాలను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఉచిత బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థులు వెళ్లే సమయాల్లో కాకుండా అంతకుముందే ప్రయాణాలు సాగించాలని అవగాహన కల్పిస్తున్నాం.

-ఎం. శ్రీనివాసరావు, ఆర్‌టిసి రవాణా అధికారి



పెద్దాపురంలో సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ, పెద్దాపురం

కార్మికులకు వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం చేసిన పని గంటల పెంపుదలకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడలో ధర్నా జరిగింది. మంగళవారం స్థానిక జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ మాట్లాడారు. 8 గంటల పని విధానం కోసం 140 సంవత్సరాల క్రితమే కార్మిక వర్గం పెద్ద ఎత్తున ఉద్యమించిందన్నారు. ఫలితంగానే 8 గంటల పని విధానం అమలులోకి వచ్చిందని గుర్తు చేశారు. ఇందుకోసం ఎందరో కార్మికులు ప్రాణ త్యాగాలు చేశారని అన్నారు. అందుకు ప్రతిఫలంగా వచ్చిన 8 గంటల పని విధానం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతూ వస్తుందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ 12 గంటల నుంచి 13 గంటల వరకూ కార్మికులతో పని చేయించుకోవచ్చని రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేయడం కార్మిక వర్గానికి ద్రోహం చేయడమేనని అన్నారు. పని గంటల పెంపుదల వల్ల తీవ్రమైన నిరుద్యోగ సమస్య ఏర్పడుతుందన్నారు. ఈ పని గంటల పెంపుదల వల్ల మరింతగా నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా కార్మికులను రాత్రిపూట డ్యూటీ చేయించుకోవచ్చని చెప్పడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. పగటి పూటే మహిళలకు రక్షణ లేకపోతే రాత్రిపూట రక్షణ ఎవరు కల్పిస్తారని నిలదీశారు. పని గంటలు పెంచిన ప్రభుత్వం వేతనాలు ఎందుకు పెంచలేదన్నారు. 15 ఏళ్లుగా కనీస వేతనాల సవరణ చేయని పాలకులు కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు పని గంటలను పెంపుదల చేసిందన్నారు. తక్షణమే కనీస వేతనాల సవరణ చేసి కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక వర్గ ఆగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎంఎస్‌ఆర్‌యు నాయకులు సిహెచ్ వెంకట్రావు, శ్రీనివాస్, తలుపులమ్మ, శేఖర్, రాజు, శ్రీను, లక్ష్మి, జ్యోతి, దుర్గ తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్ మాట్లాడారు. పని గంటల పెంపుదల దుర్మార్గమని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోతుందని, తక్షణమే అసెంబ్లీలో ఆమోదించిన తీర్మానాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు చింతల సత్యనారాయణ, పాండవ గిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వడ్డి సత్యనారాయణ, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు టిఎల్.పద్మ, నాయకులు కాలే దేవి, లక్ష్మి, సత్య, ఉమా, చంటి, సిఐటియు నాయకులు గూనురు రమణ, డి.కృష్ణ, అప్పన్న పాల్గొన్నారు.



కాకినాడలో ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

వయోజన విద్యతో అక్షరాస్యత పెంపు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

వయోజన విద్యతో అక్షరాస్యతను పెంపుదల చేయవచ్చునని ఎపిఒ రాయుడు గంగ భవాని అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షర ఆంధ్ర శిక్షణా తరగతులు కార్యక్రమం జరిగింది. రిసోర్స్‌పర్సన్ అనిశెట్టి సీతారామరాజు విద్యలో మెలకువలను వివరించారు. అనంతరం ఎపిఒ మాట్లాడుతూ వయోజన విద్య ద్వారా నూటికి నూరు శాతం అక్షరాస్యతను సాధించవచ్చని అన్నారు. చదువుపై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. నిరక్షరాస్యులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, మేట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన దాడిశెట్టి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మాజీ మంత్రి వైసిపి పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా మంగళవారం కిర్లంపూడిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని ప్రజాజీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు, వైసిపి నాయకులు యనుమల కృష్ణుడు, గౌతు స్వామి, పోల్నాటి శేషగిరి, లాలం బాజ్జీ, నాగం దొరబాబు, పాల్గొన్నారు.



ముద్రగడతో మాట్లాడుతున్న దాడిశెట్టి రాజా

ఆఖరి మజిలీ... ఎంత కష్టం..!

ప్రజాశక్తి - తాళ్లరేవు

జీవితంలో బతికినంత కాలం ఎన్ని కష్టాలు పడినా ఆఖరి మజిలీ ఆనందంగా సాగాలని ప్రతి వ్యక్తితో పాటు, ఆ కుటుంబ సభ్యులు కోరుకుంటారు. అయితే ఆ ఆఖరి మజిలీ ఇక్కడ ఎన్నో కష్టాల నడుమ సాగుతోంది. మండలంలోని పోలేకుర్రు పంచాయతీ తూర్పుపేట గ్రామ శ్మశాన వాటిక గ్రామానికి ఎదురుగా ఉన్న జాతీయ రహదారి 216 దాటి వెళ్లాలి. గ్రామాన్ని దాటి వెళ్లేందుకు ఉన్న ఒకే ఒక రహదారి దశాబ్దాలుగా పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయి ఉంది. ఏదో ఒక విధంగా ఆ గుంతలలో ప్రయాణించి జాతీయ రహదారి దాటిన తరువాతే అసలు కష్టం ఆరంభం అవుతుంది. ఆఖరి మజిలీ కోసం తీసుకెళ్తున్న పార్థివ దేహాన్ని మోసుకుంటూ వెళ్లడం కష్టతరంగా మారింది. నడవడానికి వీలులేని చిన్న గట్టుపై కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఆపసోపాలు పడ్డారు. మంగళవారం గ్రామానికి చెందిన మల్లాడి చిన్నారావు(34) గుండెపోటుతో మృతి చెందాడు. అతని పార్థివదేహాన్ని శ్మశానానికి తీసుకు వెళ్లడానికి గ్రామస్తులు నానా ఇక్కట్లకు గురయ్యారు. పాలకులు, అధికారులకు తమ గోడును వెళ్లబుచ్చినా పట్టించుకునే వారు లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామానికి శ్మశాన వాటికను ప్రత్యేకంగా కేటాయించాలని, అప్పటివరకు ఉన్న శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



పంట గట్టుపై పార్థివదేహాన్ని మోసుకెళ్తున్న బంధువులు

'దౌత్య సంబంధాలు మెరుగు పర్చుకోవాలి'

ప్రజాశక్తి - కాకినాడ

పొరుగు దేశాలతో దౌత్య సంబంధాలను భారతదేశం మెరుగు పరుచుకోవాల్సిన అవసరం ఉందని యుటిఎఫ్ సీనియర్ నేత ఐ. ప్రసాదరావు అన్నారు. కాకినాడ యుటిఎఫ్ హోంలో రఘుపతి వెంకటరత్నం నాయుడు స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 'పొరుగు దేశాల్లో పరిణామాలు - నేర్పుతున్న పాఠాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్. సూరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడారు. 1991కి ముందు భారత దేశం అవలంభించిన అలీన విదేశాంగ విధానం సర్వత్రా ప్రశంసలు అందుకుందన్నారు. మన సరిహద్దు దేశాలతో ఏర్పడిన సార్క్ (సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఆఫ్ రీజినల్ కో- ఆపరేషన్) కూటమి కి భారత దేశమే నాయకత్వ పాత్ర పోషించిందన్నారు. ఇటీవల నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్‌లో పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్థాన్, మాల్దీవులులలో జరుగుతున్న పరిణామాలు వివరించారు. భారత దేశం అమెరికా సామ్రాజ్యవాదానికి లొంగరాదని, దేశ సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవాలన్నారు. అలీన విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తూ, సరిహద్దు దేశాలతో దౌత్య సంబంధాలు మెరుగు పరుచుకోవాలన్నారు. ఇదే సమయంలో దేశంలో అంతర్గతంగా ఉన్న నిరుద్యోగం, పేదరికం, అవినీతి, సామాజిక అసమానతలు, ఆర్థిక అంతరాలు వంటి సమస్యలను పరిష్కారం చేసుకోవాలన్నారు. భారత రాజ్యాంగం పునాది గా పాలన సాగించాలన్నారు. ఈ సదస్సులో ఆర్‌విఎన్ స్టడీ సర్కిల్ కన్వీనర్ ఎన్.గోవిందరాజులు, న్యాయవాది కాళి, ఇబ్రహీం తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.రాజుబాబు, జిఎస్.వర్మ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కోటనందూరు

తుని పట్టణంలో మంగళవారం స్వచ్ఛ తాహీ సేవ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ నార్ల భవనసుందరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ వారి వృత్తిలో తీసుకోవాల్సిన ఆరోగ్య పరమైన జాగ్రత్తలను కార్మికులకు సూచించారు. మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎ.వెంకటరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు కుసుమంచి శోభారాణి, టిడిపి నాయకులు సత్యనారాయణ, నార్ల రత్నాజీ, కౌన్సిలర్ సూరిశెట్టి సుభద్ర, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని మల్లవరం గ్రామానికి చెందిన చిట్టూరి చక్రధర్ రావుకు మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ రూ.60 వేల చెక్కును టిడిపి మండల అధ్యక్షులు ధూళిపూడి వెంకటరమణ బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు విళ్ళ వీర, నాయకులు వుంగరాల వెంకటేశ్వరరావు, విళ్ళ సత్యనారాయణ, ధూళిపూడి వి.వెం.సుబ్బారావు, పితాని విష్ణు, పాల్గొన్నారు.

వ్యవసాయంలో యాంత్రీకరణ అవసరం

ప్రజాశక్తి - కోటనందూరు

వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ వినియోగం ఎంతో అవసరమని వ్యవసాయ విస్తరణ అధికారి పి.జగ్గఅప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని అల్లిపూడి, కోటనందూరు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో దాదాపు వరి నాట్లు పూర్తియ్యాయని అన్నారు. వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన సూచనలను రైతులకు వివరించారు. ఉక్కపోత, ఎండ తీవ్రతతో వరి పొలాలకు దోమ వస్తుందని, వాటి నివారణకు పసుపు రంగు జిగులు అట్టలు వాడటం ద్వారా రెక్కల పురుగులను, దోమను అరికట్టవచ్చునని అన్నారు. ఈ పసుపు రంగు జిగులు అట్టలు రైతు సేవా కేంద్రంలో రాయితీపై అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ సురేష్, విఎఎ శివకుమారి, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న అధికారి జగ్గఅప్పారావు

పర్యావరణ పరిరక్షణకు కృషి

ప్రజాశక్తి - కాకినాడ

పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేద్దామని ఐడిఎ కార్యదర్శి డాక్టర్ అడ్డాల పిలుపునిచ్చారు. మంగళవారం ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఐడిఎ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు అడుగులు వేద్దాం - కాలుష్యాన్ని నిర్మూలిద్దాం' అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షల టన్నుల ప్లాస్టిక్ వాడుతున్నారని, కుప్పలు తెప్పలుగా పడివున్న ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తే భవిష్యత్ తరాలు ఆనందంగా ఉంటాయని అన్నారు. ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యమ్నాయంగా జనపనార సంచులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ మూర్తి, ఎన్‌ఎస్‌ఎస్ పిఒలు టి.తేజేశ్వరరావు, డి.అశ్విని, ఐడిఎ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

జిల్లా స్థాయి డిబేట్స్‌లో ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - కరప

అక్టోబర్ 11న జరిగే అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా కాకినాడలో నిర్వహించిన జిల్లాస్థాయి డిబేట్స్ పోటీలో అరట్లకట్ట హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ప్రథమ బహుమతిని పొందారని పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌కుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన కొట్టు అఖిల్‌కుమార్, బత్తుల ఐశ్వర్యాంబికలకు రూ.5 వేలు చొప్పున నగదు బహుమతిని అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను విద్యాకమిటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

పలుచోట్ల ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి - కాజులూరు

మంగలంలోని దుగ్గుదురు, గొల్లపాలెం పిహెచ్‌సిల పరిధిలోని పల్లిపాలెం, సేలపాక గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో ఆయా పిహెచ్‌సి వైద్యులు సౌజన్య, సుప్రియ, శ్రేయ, స్వాతి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ రాజారావు, సర్పంచులు పోతు గనిరాజు, భాస్కరరావు, కూటమి నాయకులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీసు స్టేషన్ వద్ద ఉన్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరావు, సత్తి సోమరాజు, పాఠంశెట్టి రమేష్, కర్నాకుల సూరిబాబు, గంధం శ్రీను, అంకం ఓం కష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పి-4 విధానంపై శిక్షణ

ప్రజాశక్తి - గండేపల్లి


స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయిలో పి-4 విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ పరిపాలనాధికారి కె.చంద్రరావు మాట్లాడారు. మార్గదర్శిలకు, బంగారు కుటుంబాలకు వారధిగా ఉండాలని సిబ్బంది పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఒటిలుగా వి.సూర్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి కె.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యంతో వ్యాధుల నివారణ

ప్రజాశక్తి - కరప

ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలిక, స్వల్పకాలిక వ్యాధులకు నివారణ లభిస్తుందని ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ దివ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుర్వేదంపై అనేక అపోహాలు ఉన్నాయని, ఆయుర్వేద వైద్యం వేడి చేస్తుందన్నది అపోహా మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దుర్గాప్రసాద్, శీను, బ్రహ్మాజీ, మహేష్, పవన్, అంజి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గూగుల్ క్లౌడ్‌తో అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌గా రాష్ట్రంలో తొలి యూనివర్సిటీగా ఆదిత్య నిలిచిందని ప్రో.ఛాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ భాగస్వామ్యంతో ఆదిత్య యూనివర్సిటీ గూగుల్ క్లౌడ్ డిజిటల్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా గూగుల్ క్లౌడ్ సర్టిఫికేషన్లు, అకడమిక్ ప్రోగ్రామ్‌లు, అండర్‌గ్రాడ్యుయేట్ పాఠ్యక్రమాల్లో భాగం కానున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఇండస్ట్రీ-లింక్డ్ ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధనా సహకారాలు వంటి అవకాశాలు కల్పించబడతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా గూగుల్ క్లౌడ్ రీజినల్ హెడ్ శ్రీసిద్ధార్థ దల్వాడి, హెనోటిక్ గ్రూప్ వ్యవస్థాపకుడు, సిఇఒ బి.మల్లేశం పాల్గొన్నారు 'విద్యార్థులను ప్రపంచ స్థాయి పోటీకి తగినట్లుగా, పరిశ్రమలకు సిద్ధం చేయడంపై దృష్టి సారించినట్లు వైస్-చాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్ అన్నారు. ఎలైట్ డిజిటల్ క్యాంపస్ ద్వారా ఎఐ ఆధారిత విద్యా వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రో-చాన్సలర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎస్.రమాశ్రీ ప్రో వైస్-చాన్సలర్లు డా. ఎ. రమేష్, డాక్టర్ రవి థంగజాం, డాక్టర్ జి.సురేష్, కో.ఆర్డినేటర్ ఐటి విభాగం అధిపతి డాక్టర్ ఎం. రాజబాబు పాల్గొన్నారు.



గూగుల్ క్లౌడ్‌తో అవగాహనా ఒప్పందం చేసుకుంటున్న ఆదిత్య ప్రతినిధులు



కూలిపోయిన ఇంటి వద్ద బాధితులు

వర్షానికి కూలిన పెంకుటిల్లు

ప్రజాశక్తి - సామర్లకోట

గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు సామర్లకోటలో పెంకుటిల్లు కుప్పకూలింది. ఆ ఇంటిలో నివసిస్తున్న కుటుంబానికి తృటిలో ప్రమాదం తప్పింది. బాధితులు, స్థానిక కౌన్సిలర్ నేతల హరిబాబు తెలిపిన వివరాలు ప్రకారం...పట్టణ పరిధిలోని 13వ వార్డులో ఎడ్ల కోటయ్య, ఎడ్ల నూకమణి, ఎడ్ల శ్రీను పెంకుటింటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోడలు పూర్తిగా తడిచి పోయాయి. దీంతో సోమవారం రాత్రి కుటుంబామంతా నిద్రకు సిద్ధమవుతుండగా ఇంటిపై కప్పుతో పాటు సగానికి పైగా ఇల్లు కూలిపోయింది. ఆ సమయంలో దంపతులు ఇంట్లోనే ఉండగా ఇంటి పైభాగం కూలుతున్నట్లు శబ్దం వినిపించడంతో కుటుంబీకులు వెంటనే బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. అయితే తమకు ఇల్లు కట్టుకునే స్థోమత లేకనే పాత ఇంట్లో ఉంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కుటుంబీకులు కోరారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల మెయిన్‌రోడ్డు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు..యానం నియోజకవర్గం సావిత్రి నగర్ గ్రామానికి చెందిన మచ్చ లక్ష్మీ సత్యనారాయణ(21), అదే గ్రామానికి చెందిన పాలెపు కోసరాజు(20) ఈ ప్రమాదంలో మరణించారు. ప్రమాదంలో ఇల్లంగి మణి అనే మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కోరంగి ఎస్.ఐ. సత్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు అదుపు తప్పి పలువురికి గాయాలు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని తీపర్రు ఆర్ అండ్ బి మెయిన్ రోడ్డుపై ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ విరిగి బైకును బస్సు ఢీకొని పలువురికి గాయాలయ్యాయి. నరసాపురం నుండి నిడదవోలు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో బస్సు అదుపుతప్పి నిడదవోలు నుండి పెరవలి వైపు బైకుపై వస్తున్న కడింపాడుకు చెందిన సలాది సత్యనారాయణను ఢీకొని రోడ్డు ప్రక్కనే ఉన్న ఇంటి లోపలికి దూసుకొని వెళ్ళింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన సత్యనారాయణను తణుకు యాపిల్ హాస్పిటల్‌కు తరలించారు.

వాడపల్లి ఆలయ ఛైర్మన్ వెంకటరాజుకు సత్కారం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఛైర్మన్‌గా ముదునూరి వెంకటరాజు నియమితులయ్యారు. కొత్తపేట మండల టిడిపి యువత మంగళవారం ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలు వాతో సత్కరించి శు భాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే యాత్రికుల కు మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

సోలార్‌తో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి - ఆలమూరు

సోలార్ విద్యుత్తుతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, వీటిని విని యోగ దారులు అంతా గుర్తించి సోలార్ అధికంగా ఉపయోగించే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాన్స్‌కో మండపేట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీధర్ సూచించారు. మండ లంలోని జొన్నాడలో మంగళవారం వినియో గదారులకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పించేందుకు కరపత్రాలను ఆయన పంపిణీ చేసి వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి బాబి, ఏఈ దుర్గాప్రసాద్, ఎల్‌ఐ కెవివిఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు పాశర్లపూడికి చెందిన బొక్కా గంగాధర్‌రావు, లక్ష్మి దంపతులు మంగళవారం రూ 10,116 విరాళంగా సమర్పించారని ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ముందుగా దాతలు స్వామి వారిని దర్శించుకున్నారు. దాతలకు స్వామివారి చిత్రపటాన్ని ఆలయ అధికారులు అందజే శారు. ఆలయంలో దశమి నవరాత్రుల సం దర్భంగా రెండవ రోజు ధాన్యలక్ష్మి అలం కరణతో పూజలు నిర్వహించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

డ్రగ్స్ వద్దు బ్రో అంటూ యువత భవిష్యత్తు, మహిళల రక్షణ కోసం విద్యార్థి దశ నుండే ఉత్తమ విలువలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని రావులపాలెం రూరల్ సిఐ సిహెచ్.విద్యాసాగర్, ఎస్‌ఐ జి.నరేష్ అన్నారు. కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం పోలీసు ఉన్నతాధికారులు విద్యార్థులకు వివరణాత్మక సందేశంతో అవగాహన కార్యక్రమా న్ని నిర్వహించారు. పలు అంశాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో చైతన్య కలిగించడంతో పాటు మంచి పౌరులుగా ఎదగడానికి విలువైన సందేశం ఇచ్చారు.

బీమా పాలసీలపై జిఎస్‌టి తీసివేయడంపై హర్షం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

బీమా పాలసీలపై జిఎస్‌టి తీసి వేయడంపై ఎఐ యూనియన్ డివిజనల్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం అమలా పురంలో అధ్యక్షులు సానబోయిన వీరభద్ర రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన అధ్యక్షతన ఏజెంట్ మిత్రులందరికీ అభినందనలు తెలియజేసి కేక్ కట్ చేసి స్వీట్స్ పంచి పెట్టారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనే జర్ సుధాకర్ రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచ్ మధు బాబు, మేనేజర్ క్లాస్-1 ఆఫీసర్స్ శేషగిరి, చక్రవర్తి, డిఒ రమేష్‌బాబు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, ఎఐ యూని యన్ సెక్రటరీ గుమ్మలూరు వినాయకరావు, తదితరులు పాల్గొన్నారు.

మాంసం దుకాణదారులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మేక మాంసం దుకాణదారులకు బండారులంక గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మంగళవారం కౌన్సెలింగ్ ఇచ్చి తగు సూచనలు చేశారు. ఆరోగ్యవంతమైన, తాజా మేక మాంసాన్ని మాత్రమే విక్రయించాలని సూచించారు. ఆరోగ్య, పారిశుధ్య సూచనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యానాం వార్తలు

గవర్నర్‌ను కలిసిన ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - యానాం


గవర్నర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంఎల్‌ఎ

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్‌నాథన్‌ను యానం ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యానానికి సంబంధించిన పలు విషయాలను ఆయనతో చర్చించినట్లు స్థానిక విలేకరులకు ఎంఎల్‌ఎ తెలిపారు. విద్యుత్ శాఖలో హెల్పర్ పోస్టులకు సంబంధించి జనరల్ కేటగిరిలాగే రిజర్వేషన్ కలిగి ఉన్న వారికి అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిపారు. ఐలాండ్ నెంబర్ 3 సమీపంలో ఒఎన్‌జిసి గ్యాస్ పైప్‌లైన్ లీకేజీ పై ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించలేదని, బాధిత ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలన్నారు. అగ్రికల్చర్ డిడి శివసుబ్రహ్మణ్యన్ విధులు సరిగా నిర్వహించకపోవడమే కాకుండా తనకు ఎలాంటి సమాచారం అందించడం లేదని ఆయనకు వివరించినట్లు తెలిపారు. ఆది ద్రావిడ శాఖలో అభివృద్ధి పనులు జరగకుండా కొంతమంది అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి డిడి పనితీరు బాగాలేదని వివరించినట్లు తెలిపారు. తక్షణమే నూతన డిడిని నియమించాలని కోరినట్లు తెలిపారు. అంతేకాకుండా పలు సమస్యలకు సంబంధించి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.


బాల్ బ్యాడ్మింటన్ విజేతలతో సిబ్బంది

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

ఈ నెల 25 నుంచి 28 వరకు తమిళనాడు దిండిగల్ జిల్లాలో భారత బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 44వ బాల బాలికల సబ్ జూనియర్, 71వ సీనియర్ జాతీయ స్థాయి బాల్ బ్యాట్మెంటన్ క్రీడా పోటీలకు యానాం నుంచి 12 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు క్లబ్ సెక్రటరీ కాపగంటి అనురాగఆదర్శ శేషసుమన్ తెలిపారు. ఎంపికైన వారిలో సబ్ జూనియర్ విభాగంలో పాలెపు యోమంత్ గంగాధర్ భరత్, కట్టుంగి డివివి.మణిదీప్, కర్నీడి శివ ప్రణీత్, పెయ్యల కృష్ణమూర్తి, ఆకుల కస్తూరి శివప్రసాద్ ఎంపికయ్యారు. బాలికల విభాగంలో జువ్వల బాల శ్రీ నిత్యం, పోలిశెట్టి హర్షిణిదేవి, కుసుమ చార్మిల ఎంపికయ్యారు. సీనియర్ విభాగంలో చోడే గుణశ్యామ్ ప్రతాప్, యడ్ల రవి కుమార్, ఆలపాటి సంజన, గుర్రాల శ్రీవల్లి ఎంపికయ్యారన్నారు. పుదుచ్చేరి రాష్ట్ర జట్టుకు రీజెన్సీ పబ్లిక్ స్కూల్ పిఇటి బొట్టా శ్రీనివాస్ కోచ్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా యానాం బాల్ బాడ్మింటన్ క్లబ్ సీనియర్ క్రీడాకారులు రాయపురెడ్డి విజయ్, చింతా వాసు, క్లబ్ సభ్యులు ఎంపికైన వారిని అభినందించారు.

రీజెన్సీ విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - యానాం

కాకినాడ డిఎస్‌ఎ స్టేడియంలో ఈనెల 21న నిర్వహించిన ఎపి ఇంటర్ డిస్ట్రిక్ట్ మోడరన్ పెంటాథ్లాన్ బియా ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో యానాం రీజెన్సీ జూనియర్ కళాశాల విద్యార్థి కోలాటి సతీష్‌కుమార్ బంగారు పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ పి.ఎం.ప్రసాద్ తెలిపారు. అండర్-17 విభాగంలో 1200 మీ.పరుగు, 100 మీ. ఈత, 1200 పరుగు పోటీలలో విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు పోతుల సోమేశ్‌ను ప్రిన్సిపల్ అభినందించారు.

ఎన్‌జిఒ సంఘ అధ్యక్షునిగా సీతారామస్వామి

ప్రజాశక్తి - సామర్లకోట

ఎపిఎన్‌జిఒ సామర్లకోట తాలూకా యూనిట్ అధ్యక్షునిగా అసిస్టెంట్ సబ్ రిజిస్టర్ ఎం.సీతారామస్వామి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారంభీమేశ్వర లైన్స్ క్లబ్ భవనంలో నూతన కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు సహాయ ఎన్నికల అధికారి బిఆర్‌వి.చౌదరి, కె.కేశవరరావు, పాలపర్తి మూర్తిబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. అన్ని పదవులకు ఒక్కో నామినేషన్ దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షునిగా ఎం.సీతారామస్వామి, అసోసియేట్ అధ్యక్షులుగా పివి.నూకరాజు, ఉపాధ్యక్షులుగా ఆర్‌జె.మీనాకుమారి, పి.చరణ్‌కుమార్, కార్యదర్శిగా ఎస్.శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎన్‌జి.రత్నకుమారి, ఎస్‌కె.రేష్మ, వి.లక్ష్మణస్వామి, మహిళా జాయింట్ సెక్రటరీగా డి.రామా కుమారి, కోశాధికారిగా ఎ.జేజేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సీతారామస్వామి మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించేందుకు అందరి సహకా రంతో ముందుకు సాగుతానని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని జిల్లా ఇన్‌ఛార్జ్ ఎం.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, ఉపాధ్యక్షులు సరళ చంద్రావు, కెవిఎన్‌వి. ప్రసాద్, జిల్లా సంయుక్త కార్యదర్శి టి.చార్లెస్‌పాల్ సత్కరించారు.


నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న నాయకులు

లోక్ కల్యాణ్ లోన్ మేళా

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక రథాలపేట అంబేద్కర్ భవనంలో మంగళవారం వీధి వ్యాపారులకు లోక్ కల్యాణ్ లోన్ మేళాను నిర్వహించారు. మెప్మా సిఎంఎం కె.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.ప్రియంవద పాల్గొని మాట్లాడారు. లోక్ కల్యాణ్ మేళ 2.0 కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకూ ప్రతి యుఎల్‌బిలో జరుగు తుందన్నారు. వీధి వ్యాపారులకు మొదటి విడతగా 15,000/బి రెండో విడతగా 25,000/బి మూడో విడతగా 50,000/బి రుణాలు పెంచి ఇస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ ట్రాన్స్‌క్షన్స్ ఫోన్ పే, గూగుల్ పే, పెటిఎం ట్రాన్స్‌క్షన్స్ వలన ప్రతినెల 100/బి పైన క్యాష్ బ్యాక్ వస్తుందని వివరించారు. బ్యాంక్ నుంచి తీసుకున్న రుణాలు సక్రమం గా చెల్లిస్తే బ్యాంకు తిరిగి రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఈ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2029 వరకు పొడిగించినట్లు తెలిపారు. పిఠాపురం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సతీష్ మాట్లాడు తూ ఇ శ్రమ్, శ్రమ యోగి మం దాన యొక్క ప్రయోజనాలు వివరించారు. ఈ కార్య క్రమంలో వివిధ బ్యాంకుల మేనేజర్లు, పోస్టల్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మిడ్వే సంజీవని హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కె.కరుణ మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు నెలసరి సరిగ్గా రాకపోవడం, రక్తహీనత, అధిక రక్తస్రావం వంటి సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వారోత్సవాల్లో భాగం గా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. మిడ్వే సంజీవని హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ డి.సౌజన్య మాట్లాడుతూ విద్యార్థినులలో అధిక రక్తస్రావం, ఋతుసమస్యలను గ్రహించటం జరిగిందని తెలిపారు. అవసరమైన మందులను అందించటం జరిగిందని అన్నారు. రక్తహీనత, ఇతర సమస్యల పట్ల విద్యార్థినులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యను గుర్తించినట్లు అయితే తక్షణమే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ శిబిరంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ జి.నాగశ్రీకాంత్, మిడ్వే సంజీవని హాస్పిటల్స్ యాక్టివిటీ మేనేజర్స్ జి. శివప్రసాద్, విజయ్, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పిఒ పి.సురేఖదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి, వాలంటీర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

33/11 కెవి తాళ్లరేవు విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో మెయింటినెన్స్ పనుల నిమిత్తం బుధవారం 8 గంటల నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంత రాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.ఉదయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, కోరంగి, సీతారాంపురం, సిబి.పాలెం, పిబివి.పాలెం, గాడిమొగ, చినవలసల, పెదవలసల, లక్ష్మిపతిపురం, పి.మల్లవరం, పత్తి గొంది, జార్జి పేట, ఎంఎల్‌కె నగర్, నీలపల్లి, పోలేకుర్రు, ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కరాటే పోటీల్లో ఛాంపియన్‌గా తూర్పు

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 21న విశాఖపట్నంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే టోర్నమెంట్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను కైవశం చేసుకుంది. మంగళవారం విజేతలకు స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో అభినందన కార్యక్రమం జరిగింది. ఎపి కరాటే అసోసియేషన్ నాయకులు, కోచ్ డి.శంకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లయన్స్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాసరావు, కార్యదర్శి బడుగు సీతారామ రాజు, కోశాధికారి ఏలేటి రమేష్, జిల్లా ఛైర్మన్ చిత్తులూరి వీర్రాజు పాల్గొని మాట్లాడారు. దశాబ్ద కాలంగా కరాటే కోచ్ శంకర్ శిక్షణలో వందలాది మంది ఆత్మరక్షణ విద్యను అభ్యశించడంతో పాటు జాతీయ స్థాయిలోనూ రాణిస్తున్నారని కొనియాడారు. విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్న కోచ్ శంకర్‌ను అభినందించారు. కోచ్ శంకర్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 102 మంది పోటీల్లో పాల్గొనగా 46 మంది పతకాలు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందించి అభినందించారు. కోచ్ శంకర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోచ్‌లు ఎం.ప్రసన్నకుమార్, కె.భద్రి, కె.జానకిరామ్, లయన్స్ నాయకులు మేకా శ్రీనివాసరావు, గుండు శంకర్రావు, విజేతల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


విజేతలను అభినందిస్తున్న నిర్వాహకులు

చిరుధాన్యాల సాగుతో ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆదాయం ఆరోగ్యం సమకూరుతుందని పలువురు అన్నారు. మంగళవారం ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏరువాక కేంద్రం రైతులకు విత్తనాలు, ఎరువులు, పిచికారీ యంత్రాలు వ్యవసాయ పంచాంగాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మారుటేరు పరిశోధన సహసంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు వలన రైతులకు ఆర్థిక లాభాలు మాత్రమే కాకుండా ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందుతుందని అన్నారు. అలాగే చిరుధా న్యాలలో ఉన్న పోషక విలువలను వివరించారు. ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ శర్మ మాట్లా డుతూ చిరుధాన్యాల పంటలో వచ్చే పురుగులు, తెగుళ్ళు, వాటి నివారణ పద్ధతుల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ రామభద్ర రాజు, శాస్త్రవేత్తలు డాక్టర్ సుధీర్, సుజాత, డాక్టర్ దయాళ్‌ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.


ఎరువును పంపిణీ చేస్తున్న అధికారులు

24 గంటల విద్యుత్ సరఫరా ప్రారంభం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఆర్‌టిఎస్ పథకంలో మండలంలోని బలరామపురం గ్రామానికి 24 గంటల పాటు నిరంతర విద్యుత్తు సరఫరా మంగళవారం ప్రారంభం అయింది. సర్పంచ్ పైల సీత, ఎంపిటిసి సభ్యులు శ్రీసోమరౌతు రవి, సొసైటీ అధ్యక్షులు పైలు పైడ్రాజు, టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు పైలా నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించారు. బలరాంపురం గ్రామానికి ఇకపై విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉండదని, ఇందుకు కృషి చేసిన ఎంఎల్‌ఎ వరుపుల సత్యప్రభకు వారు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న సర్పంచ్ సీత

బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో ప్రతిభ

ప్రజాశక్తి - సామర్లకోట

హర్యానా రాష్ట్రంలో ఈ నెల 13 నుంచి 21 వరకు జరిగిన 'యోనెక్స్ సన్‌రైజ్ అశ్విని గుప్తా మెమోరియల్ ఆల్ ఇండియా సబ్ జూనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్'లో మండలంలోని అచ్చం పేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ డబుల్స్ విభాగంలో రన్నరప్‌గా నిలిచాడు. ఈ విజయంతో చైనాలో జరగబోయే ఆసియన్ గేమ్స్‌కు అర్హత సాధించాడు.


తోటి క్రీడాకారుడితో బహుమతిని అందుకుంటున్న హరికృష్ణ